# దేవలుడు

తపస్సు ద్వారా మోక్షం సాధించాలనుకున్న దేవలుడి మనసు యోగ విద్యవైపు కూడా మరలింది. త్వరలోనే ఆ విద్య కరతలామలకమైంది. తాపసోత్తములు సాధించలేని ఎన్నో విద్యలు అతను సంపాదించగలిగాడు.

మోక్షం సాధించడానికి తపస్సే మార్గమా, గృహస్థాశ్రమం తగదా- అని ఎన్నిమార్లో అతనికి అనిపించింది. అది అతని మనసులో ఒక ప్రశ్నగా రూపొందింది. ఆ ప్రశ్న కోరికగా మలుపు తిరిగింది. అదే అతని జీవిత ధ్యేయంగా తయారయింది.

తను గృహస్థు కావాలనే భావం అతని మనసులో స్థిరపడిపోయింది.

దేవలుడు యమునా నదీతీరాన ఉన్న అడవుల్లో చాలాసార్లు సంచరించాడు. ఆ నది దాటటానికి అతను ఎన్నడూ నావ ఎక్కనేలేదు. యోగవిద్యలో ఆరితేరిన అతనికి నది దాటటం సునాయాసమైంది.

ఆనాడు నది దగ్గర కొచ్చిన దేవలుని దృష్టి అక్కడ పడవ నడిపే స్త్రీమూర్తిపైన ప్రసరించింది. గృహస్థు కావాలనే ఆలోచనతో నిండిన అతని మనసు ఆమెవైపు పరుగులు తీసింది. దేవలుడు ఆనాడు నది దాటకుండానే గృహోన్ముఖుడయ్యాడు. వివాహం చేసుకుందామనే ఆలోచన వచ్చినప్పటినుంచీ తనకు తగిన కన్య ఎవరా అని ఎన్నోసార్లు అనుకున్నాడు.

దేవలుడు కళ్ళముందు ఆ పడవ నడిపే యువతి మెరుపులా భాసించింది. యౌవన భారంతో సౌందర్య రాశిలా ఉన్న ఆమెరూపం అతను ముందు కదలాడింది. ధ్యానం కుదరని దేవలుడు ఆశ్రమంవదలి యమునాతీరానికి వచ్చాడు. నావ లేదక్కడ. పడవ నడిపే ఆమె కూడా లేదు. దేవలుడికి ఆమెను ఎలాగైనా చూడాలనే తహతహ ఎక్కువైంది. అవలి ఒడ్డున ఉన్న ఆమెను ఇటురమ్మని చేయి ఊపాడు. కేక వేశాడు. ఆమె తనకోసం ఇప్పుడే ఇటువస్తుందా! ఏమో. దేవలుడు అక్కడ చాలాసేపు నిలిచాడు.

నావ వడ్డును చేరుతుంటే దేవలుడికి మహదానందమైంది. ఈమెతో సంభాషించటానికి, ఈమెను పరిశీలనగా చూడటానికి ఇదొక నెపం కానీ, ఈ

నది దాటటం తనకి సాధ్యం కాకనా? దేవలుడు చిరునవ్వుతో ఆమెను సమీపించాడు.

దాశరాజు కూతురు సత్యవతికి అప్పుడు గుర్తొచ్చింది - నీటి మీద తేలి పోతూ నది దాటే మునీశ్వరుడు ఇతనేనని. ఇతను ఏనాడూ తన నావ ఎక్క లేదు. అయినా మునీశ్వరుడు నావలో నది దాటించటమంటే తను దాటించాలిగా?

దేవలుని చూపుల్లోని భావం సత్యవతి గమనించగలిగింది. అతని నల్లని రూపమే ఆమెకు భయం కలిగిస్తోంది. అతను ఆమెను ఆపాదమస్తకం పరీక్షిస్తుంటే ఆమెకు చాలా చిరాకుగానే ఉంది. ముఖం పక్కకు తిప్పుకుని నావ నడుపుతోంది సత్యవతి.

ఆమె తనపట్ల ఎలాటి శ్రద్ధ చూపకపోవటం దేవలునికి బాధ కలిగించినా, అతని చూపు ఆమెనించి మరలటంలేదు. తన ప్రేమను ఆమెకు ఎలా తెలియ పరచాలి? తను గృహస్థాశ్రమం స్వీకరించదలచానని, ఈమెను వివాహం చేసు కుందుకు నిశ్చయించుకున్నానని ఆమెతో ఎలా మనసు విప్పి చెప్పాలి? ఆమె మనసు తెలుసుకోవటం ఎలా?

దేవలుని చూపు ఆమె సోగకళ్ళపైన, ఆమె నున్నని కంఠంపైన, ఆమె బిగువైన వక్షోజాలపైన, ఆమె సన్నని నడుముపైన నిలుస్తుంటే, వేగంగా నావ నడిపి ఒడ్డున ఆపింది సత్యవతి.

దేవలుడు ఆశ్రమం చేరాడు మనసు దేనిపైనా లగ్నం కావటంలేదు. వేదాధ్యయనం వెనకబడింది. యోగాభ్యాసం ఆగిపోయింది. అగ్నిగృహం నిస్తేజ మైంది. ఆమెపైన ప్రేమ అతన్ని ఆశ్రమంలో నిలవనీయటంలేదు. తన ప్రేమ ఎలాగైనా ఫలించాలనే ప్రగాఢమైన వాంఛ అతనిలో బలపడింది.

తెల్లవారింది. ఉదయ సూర్యుని కిరణాలు ఆశ్రమంలో చెట్లపైన బంగారు తీగలు అల్లుకున్నట్లున్నాయి. దేవలుడు చరచరా వచ్చి యమునా నదీతీరాన ఆగాడు.

అతను నావ ఎక్కడానికి వస్తుంటే సత్యవతి ముఖం ముడుచుకుంది. ఆమె పడవ నడుపుతుంటే నది దాటటం అతనికి నిత్యకృత్యమైంది. ఆ నావలో అతను గడుపుతున్న సమయమే మధుర క్షణాలుగా తలపోస్తున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. దేవలుడికి ఆమెను ఎలాగైనా వివాహం చేసుకోవాలనే కోరిక రోజు రోజుకీ పెరిగిపోయింది. ఆమె తండ్రిని కలుసుకోవాలని నిర్ణయం తీసుకుని నది ఒడ్డుకి చేరాడు దేవలుడు ఆనాడు.

అప్పుడే నావని ఒడ్డుకు చేర్చి ఇంటిముఖం పట్టిన సత్యవతి అక్కడ నిలబడ్డ దేవలుణ్ణి చూసి భయపడిపోయింది. శనిగ్రహంలా ఈ ముని తనని వెంటాడుతున్నాడనిపించింది.

భయాందోళనలతో ఇల్లు చేరిన సత్యవతిని చూశాడు దాశరాజు. ముఖాననున్న స్వేదబిందువుల్ని తుడుచుకుంటూన్న ఆమెను గమనిస్తున్న దాశరాజుకి నదీతీరాన ఏం సంభవించిందో అర్థం కాలేదు.

అంతలోనే వాకిట అసితుడైన దేవలుడి రాక గమనించాడు దాశరాజు. అంతటి మునీశ్వరుడు తన ఇంటికి రావటం మహా అదృష్టం అనుకుంటూ అర్ఘ్య పాద్యాదులు అర్పించాడు సవినయంగా.

ఆసీనుడైన అసిత దేవలుడు అన్ని దిక్కులూ పరికించాడు. "కన్యార్థినై వచ్చాను... సత్యవతిపైన నా మనసు లగ్నమయింది."

నిశ్చలంగా ఉంది దేవలుడి గొంతు.

దాశరాజుకి అర్థమై పోయింది సత్యవతి భయానికిగల కారణం. ఆమెకి ఈ అసితదేవలుడితో వివాహం ఇష్టం లేదని వెంటనే గ్రహించ గలిగాడు దాశరాజు. అయినా, రూపం, ధనం లేని ఇతన్ని వివాహమాడమని తను మాత్రం కూతురితో ఎలా అనగలడు? దేవలుడు మహాముని అనీ, మహాశక్తి సంపన్నుడనీ తనకి తెలుసు. అయినా ఆమెకు ఇష్టం లేకుండా ఎలా అంగీకరించమని చెప్తాడు?

దాశరాజు ఇంటి లోపలికి చూశాడు. గది గుమ్మంలో దాగి, భయం భయంగా దేవలుణ్ణి చూస్తున్న సత్యవతి ముఖం దాశరాజుకి కనిపించింది. ఆమె ముఖంలోని దైన్యం కూడా అతని కళ్ళకి కనిపించింది.

ఈ పరిస్థితి నుంచి తప్పించుకొనే ఉపాయం ఆలోచిస్తుంటే, మెరుపులాటి ఆలోచన అతనికి తట్టింది.

"మునీంద్రా! ఈమె నా పెంపుడు కూతురు. ఈమె తండ్రి రాజర్షి ఉపరి చరుడు. ఆయన ఆజ్ఞ ప్రకారం ఈమెను మహారాజు కిచ్చి వివాహం చేయాలి నేను. ఆమె తండ్రి ఆజ్ఞను తిరస్కరించే అధికారం నాకు లేదు. తమరు ధర్మ వరులు." దాశరాజు మునీంద్రుని పాదాలకు మొక్కాడు.

లోపలున్న సత్యవతి హాయిగా ఊపిరి పీల్చుకుంది.

అలా తన కోరికను తిరస్కరిస్తాడని ఊహించని దేవలుడు వెంటనే వెను దిరిగాడు నిరాశతో.

ఆశ్రమంలో అడుగుపెట్టిన దేవలుడి మనసు వికలమైంది. మరో కన్యని వివాహమాడి గృహస్థాశ్రమం స్వీకరించే స్థితికి అప్పట్లో అతని మనసు అంగీక రించలేదు. సత్యవతిని తన మనఃఫలకం మీదనుంచి తుడిచివేయటానికి తపస్సే శరణ్యం అనుకుంటూ ఆదిత్య తీర్థానికి చేరాడు మహాముని అసితదేవలుడు.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం
ఆదిపర్వం : చతుర్థాశ్వాసం)

(ప్రచురణ: ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 27-1-1988)